సాక్షి సంగారెడ్డి

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం (సాయంత్రం) 06:38

సహర్ : మంగళవారం (ఉదయం) 04:42



ఓటరు హెల్ప్ లైన్ 1950

ఓటర్లకు వచ్చే సందేహాలను నివారించేందుకు అధికారులు ఉచిత హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. వివరాలు 8లో ▸



అండగా ఉంటాం

పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించి ఓదార్చారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దోసెలు వేసిన పాటిల్



టిఫిన్ సెంటర్‌లో దోసలు వేస్తున్న బీబీపాటిల్

జహీరాబాద్ టౌన్: లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి బీబీ పాటిల్ టిఫిన్ సెంటర్‌లో దోసెలు వేశారు. టీ కొట్టులో చాయ్ తయారు చేశారు. అలాగే తోపుడు బండిపై కూరగాయలనూ విక్రయించారు. ఉదయం హరే రామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నగర సంకీర్తనలో పాల్గొన్నారు. ఆపై మహీంద్ర పస్తాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవీందర్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల పరిధిలోని అంకెనపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.రవీందర్, ఉపాధ్యక్షుడిగా భగవాన్ రావు, ప్రధాన కార్యదర్శిగా గొల్ల రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివరాజ్ పాటిల్, సంయుక్త కార్యదర్శిగా పి. మల్లేశంలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా శివప్రసాద్, జాయింట్ సెక్రెటరీ గురుపాదం, సభ్యులుగా జలీల్, రాజు, శ్రీశైలం, మల్లేశం, మోహన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా కృషి చేస్తామన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో స్థానికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.

రంగనాయక సాగర్ సందర్శన



రంగనాయక సాగర్ పంపింగ్‌ను పరిశీలిస్తున్న గోదావరి రివర్ బోర్డు మెంబర్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధి చంద్లాపూర్ శివారు రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను ఆదివారం గోదావరి రివర్ బోర్డు మెంబర్ శివ నందకుమార్ సందర్శించారు. రిజర్వాయర్‌లోని నీటి మట్టం పరిశీలించారు. ప్రాజెక్టులో జరుగుతున్న పనులు, మోటార్ల పంపింగ్ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసిన విధానాన్ని ఇరిగేషన్ అధికారులు వివరించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఎస్ఈ బస్వరాజ్, ఈఎన్‌సీ హరిరామ్, ఈఈ గోపాలకృష్ణ ఉన్నారు.

● చివరి వారం.. పోటెత్తిన భక్తజనం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల చివరి రోజు భక్తజనం పోటెత్తారు. మూడు నెలలుగా వైభవంగా కొనసాగిన ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన అగ్నిగుండాలతో పరిసమాప్తమయ్యాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించి దర్శించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి.

– కొమురవెల్లి(సిద్దిపేట)



రాజగోపురం ఎదుట భక్తుల సందడి



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఐటీఐలకు ఆధునిక హంగులు

- త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు
- టీటీఎల్‌తో ప్రభుత్వం ఒప్పందం
- యువతకు ఉపాధే లక్ష్యం

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐ) ఇకపై స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా మారనున్నాయి. ఇందులో ఇప్పటి వరకు అందిస్తున్న కోర్సులకు భిన్నంగా ఆధునిక సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. యువతకు ఉపాధి మార్గాలు పెంచేలా ఈ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. నూతన భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించి, పరికరాలు సమకూర్చి నూతన కోర్సులు నేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడూ ఐటీఐల్లోనూ..

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 18 ఐటీఐలున్నాయి. అందులో 3 ప్రభుత్వానివి కాగా మిగతా 15 ప్రైవేట్‌వి. టీటీఎల్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోగా ఈ మూడు మరింత అభివృద్ధి చెందనున్నాయి. టీటీఎల్ ఒక్కో కళాశాలకు రూ 4.5 కోట్లు మంజూరు చేసి వీటితో నూతన కోర్సులకు అనుగుణంగా భవనాలను నిర్మిస్తుంది. అలాగే ప్రయోగశాలలను సైతం అభివృద్ధి చేస్తుంది. అవసరమైన పరికరాలను, సాంకేతిక నిపుణులను ఏర్పాటు చేస్తుంది. టీటీఎల్ నిధులతో ఐటీఐ సంస్థల సూచనలకు అనుగుణంగా భవనాలు నిర్మించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఇందుకు అవసరమైన నిర్వహణ ఖర్చులను సంస్థే భరిస్తుంది.



హత్నూరలోని ప్రభుత్వ ఐటీఐ

కొత్తతరం బోధన

టీటీఎల్ వారు సుమారు 26 రకాల ఆధునూతన కోర్సులను ఆయా ఐటీఐ కళాశాలలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు.

ఒక్కో కోర్సుకు గాను 20 సీట్ల చొప్పున 100 సీట్లను మంజూరు చేస్తారు. దీంతో ఇప్పటికే ఉన్న వాటి కన్నా సీట్లు పెరుగుతాయి. ఒక్కో కళాశాల కనీసం ఐదు కొత్త కోర్సులను అమలు చేసేలా డిజైన్ చేశారు. స్థానిక ప్రాంతాల్లోని పరిశ్రమల అవసరాలు, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కోర్సులను ప్రవేశపెడతారు. కంప్యూటర్ సైన్స్, కృతిమ మేధ లాంటి కోర్సులకు పెద్దపీట వేయనున్నారు. వీటిలో 6 నెలల నుంచి ఏడాది వరకు.. స్వల్ప కాలిక కోర్సులతో పాటు 2 సంవత్సరాల కోర్సులు అందుబాటులో ఉంటాయి. ప్రవేశాలకు ఎలాంటి వయో పరిమితి లేదు. పదో తరగతి కనీస విద్యార్హత.

దశ మారనుంది

ప్రభుత్వం ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే ఆధునీకరణ పనులతో ఐటీఐ దశ మారనుంది. స్థానికంగా ఉన్న పరిశ్రమల అవసరాలు, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కోర్సులను ప్రవేశ పెడతారు. అత్యంత డిమాండ్ ఉన్న కోర్సులను అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

– రాజేశ్వరరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సంగారెడ్డి

● నెర్రెలు బారిన వరి పొలం



జిన్నారం, కొడకంచి, పెద్దమ్మగూడ, సోలక్‌పల్లి, మంగంపేట తదితర గ్రామాల్లో కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవటంతో పంటలు బీటలు వారుతున్నాయి. బోర్లు ఎండిపోవటం, నిరంతర విద్యుత్ సరఫరా కావడం లేదని దీంతో పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. –జిన్నారం(పటాన్‌చెరు)

ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు

- మరమ్మతులు చేయడంలో జాప్యం
- ఎండుతున్న పంటలు
- రైతులకు తప్పని కష్టాలు

పాపన్నపేట(మెదక్): కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఐదు మండలాల పరిధిలో 11,800 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా.. జనవరి నుంచి ఇప్పటివరకు 177 కాలిపోయాయి. నోటు లేనిదే సిబ్బంది టీ నోట్ రాయడం లేదు. అన్నివర్గాల చేయి తడపనిదే రిపేర్ కావడం లేదు. జిల్లాలోని అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడ్, టేక్మాల్, పాపన్నపేట మండలాల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం పాపన్నపేటలో రిపేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈప్రాంతంలో ఎక్కువగా రైతులు వరి సాగు చేస్తారు. పంట చేతికొచ్చే సమయంలో ఎండలు మండుతుండడంతో నీరు ఎక్కువగా అవసరమవుతోంది. 'గోటి మీద రోకలి పోటు'లా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకు 177 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి.

నోటు లేనిదే టీ నోటు రాయరు

ట్రాన్స్‌ఫార్మర్ కాలిందంటే రైతులకు కష్టాలు తప్పడం లేదు. మొదట హెల్పర్, లైన్‌మెన్ నిర్ధారించి అధికారులకు సమాచారం ఇస్తారు. సీఎస్‌సీలో ఆన్‌లైన్ చేసినప్పటి నుంచి లంచాల పర్వం మొదలవుతుంది. టీఆర్ఈ ఏఈ టీనోట్ ఇవ్వాలి. ఇందుకోసం రూ.300 నుంచి 400 వరకు చెల్లిస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్, లేబర్‌ను కిరాయికి తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌ను పాపన్నపేటలోని రిపేర్ సెంటర్‌కు చేరుస్తున్నారు. ఇందుకు సుమారు రూ.3 వేలు అవుతుంది. అక్కడి నుంచి రిపేర్ సెంటర్ వద్ద ఉన్న టెస్టర్ రైతు అవసరం, అమాయకత్వాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. అతను ఉండే రూం దగ్గర రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు అని రాసి ఉన్నప్పటికీ దర్జాగా డబ్బులు వసూలు చేయడం గమనార్హం. ఆ తర్వాత రిపేర్ సెంటర్ లేబర్ రూ. 600 నుంచి 800 వరకు తీసుకుంటున్నారు. మొత్తం మీద ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలితే కనీసం రూ. 6 నుంచి 8 వేల వరకు ఖర్చు వస్తుంది. నిజానికి పొలం దగ్గరకు విద్యుత్‌శాఖ వారి వాహనమే వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకు వచ్చి రిపేర్ చేసి పంపాలి. కానీ రైతులే కిరాయికి ట్రాక్టర్లు తీసుకొస్తున్నారు.



రిపేర్ సెంటర్ వద్ద కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు

డబ్బులు తీసుకుంటే చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కోసం వచ్చే రైతుల నుంచి ఎవరు డబ్బులు తీసుకున్నా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఆయిల్ కొరత ఉంది, అవసరాన్ని బట్టి తెప్పిస్తున్నాం. రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు.

– మోహన్‌బాబు, ఇన్‌చార్జి ఏడీఈ

రిపేర్ సెంటర్‌లో ఆయిల్ నిల్

రిపేర్ సెంటర్‌లో ఆయిల్ కొరత ఉంది. 100 కేవీ డీటీఆర్‌కు 190 లీటర్లు, 63 కేవీకి 160 లీటర్లు, 25 కేవీకి 25 లీటర్ల ఆయిల్ అవసరం. ఆయిల్ లేక 68 డీటీఆర్‌లు పూర్తిస్థాయిలో రిపేర్ కావడం లేదు. కాలిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ తీసి రీసైక్లింగ్ చేసి రిపేర్ చేస్తున్నారు. ఇది అంత నాణ్యతగా ఉండడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

● మత సామరస్యానికి ప్రతీక రంజాన్



సదాశివపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్



జహీరాబాద్ : మహమూద్‌కు తీపి తినిపిస్తున్న ముస్లింలు

జోగిపేట (అందోల్): పట్టణంలో మైనార్టీలు నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి దామోదర రాజనరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీలతో కలిసి ప్రార్థనలు చేశారు.

సదాశివపేట(సంగారెడ్డి): ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను సోదరభావంతో జరుపుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి సదాశివపేట పట్టణంలోని ఎస్‌గార్డెన్‌లో ఆయన ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఇలియాజ్ షరీఫ్, ఖుద్దూస్, మత పెద్దలు అక్బర్ హుస్సేన్, అశ్వక్ హుస్సేన్, జలీల్, ఖామీల్, రియాజ్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో పాటు పడ్డారని మాజీ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ ఎండీ తన్వీర్ ఆధ్వర్యంలో ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ మత సామరాస్యాన్ని చాటారన్నారు. కేసీఆర్ సిద్దిపేటలో మొట్ట మొదటి సారిగా దివంగత ఎన్టీ రామారావును ఆహ్వానించి ఇఫ్తార్ విందు సంస్కృతిని ప్రారంభించారన్నారు. పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అనిల్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఎండీ తన్వీర్ పాల్గొన్నారు.



సదాశివపేట: ఇఫ్తార్‌కు హాజరైన ముస్లింలు



రాయవరంలో వరి పంటకు ట్యాంకర్లతో నీరు పెడుతున్న రైతు

పొట్ట దశలో పుట్టెడు కష్టాలు

- ఎండుతున్న పంటలకు ట్యాంకర్లతో నీరు
- రోజురోజుకు పెరుగుతున్న రైతుల పాట్లు
- జిల్లాలో చాలా చోట్ల ఇదే దుస్థితి

జగదేవ్‌పూర్(గజ్వేల్)/కొమురవెల్లి: పంటలను రక్షించుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ముఖ్యంగా వరి పంటలు పొట్ట దశలో ఉండగా ఎండుముఖం పడుతుండటంతో విలవిల్లాడుతున్నారు. ఓ వైపు భానుడు నిప్పులు కురిపిస్తుండగా.. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. చేసేది లేక ట్యాంకర్ల ద్వారా పంటలను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. జగదేవ్‌పూర్, కొమురవెల్లి మండలాల్లో పంటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

➡ కుకునూరుపల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన చీర్ల కనకయ్య రెండు ఎకరాల్లో వరి సాగు చేశారు. రెండు బోర్లు ఉన్నప్పటికీ బోర్లలో నీటి శాతం పూర్తిగా పడిపోయింది. ఆర ఎకరం ఎండిపోగా ఎకరన్నర వరి పంట పొట్ట దశలో ఉంది. చేతికందే పంట కోసం ఐదారు రోజులుగా రోజుకు రెండు ట్యాంకర్లతో పదిసార్లు వరికి నీరు పోస్తూ బతికించుకుంటున్నాడు. పెట్టుబడి కాదు పంట దక్కితే చాలు అదే పదివేలు అంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

➡ కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన దొశెట్టి కనకయ్య రెండు ఎకరాల వరి పంట సాగు చేశారు. ఎకరం పంట పూర్తిగా ఎండిపోగా మిగిలిన ఎకరం పంట పొట్ట దశలో ఉంది. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ట్యాంకర్‌కు రూ.800 చెల్లించి నీరు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్లా ఇదే దుస్థితి నెలకొంది.

అంగన్‌వాడీలకు గుడ్‌న్యూస్

- లోక్‌సభ ఎన్నికల తర్వాత జిల్లాలో 22 టీచర్స్, 248 ఆయాల పోస్టులు భర్తీ

సంగారెడ్డి (కొండాపూర్): అంగన్‌వాడీలకు గుడ్ న్యూస్. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. కోడ్ అమలులో ఉండటంతో ఎన్నికలు ముగిసిన తర్వాత ఖాళీలను పూరిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే టీచర్లు లేక ఆయాలు, ఆయాలు లేక టీచర్లు ఈ సెంటర్లను ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. భర్తీ నిర్ణయం ద్వారా కొంతవరకు ఊరట కలగనుంది.

జిల్లాలో 1504 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 1,504 అంగర్‌వాడీ కేంద్రాలు న్నాయి. అద్దె భవనాలలో 476 ఉండగా, సొంత భవనాల్లో 577 కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 12,016 మంది గర్భిణులు, 7,231 మంది బాలింతలు ఉన్నారు. 0–3 ఏళ్ల చిన్నారులు 57,690 మంది, 3–6 ఏళ్ల లోపు 46,994 మంది ఉన్నారు. అయితే జిల్లాలో 22 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీ ఉండగా, 248 మంది ఆయా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. దీంతో చాలా చోట్ల చిన్నారులకు ప్రీ స్కూల్ విద్య అందడం లేదు. లబ్ధిదారులకు కూడా పోషకాహారం సరిగా అందకపోవడంతో రక్తహీనత వ్యాపిస్తుంది. ఎన్హెచ్‌టీఎస్ (న్యూ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) పోషణ ట్రాకర్‌లోనూ పలువురి వివరాలు నమోదు కావడం లేదు. పోస్టుల భర్తీతో ఆయా సమస్యలు తీరడంతో పాటు యువతులకు కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.



మారేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం

ఇంటర్ తప్పనిసరి

గతంలో అంగన్‌వాడీ టీచర్‌కు విద్యార్హత పదో తరగతిగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిబంధనలు మార్చింది. టీచర్ తప్పనిసరిగా ఇంటర్ ఉత్తీర్ణత సాధించాల్సిందే. వయసు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న వారు మాత్రమే అర్హులు. కేంద్రాల నిర్వహణలో సాంకేతిక వినియోగం, ఆన్‌లైన్ రికార్డుల నమోదు, ఆండ్రాయిడ్ మొబైల్ యాప్‌ల ద్వారా రోజువారీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం ఖాళీల్లో సగం ..అర్హులైన సహాయకుల పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారని తెలిసింది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే..



అంగన్‌వాడీ ఖాళీల భర్తీపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. టీచర్‌కు విద్యార్హత ఇంటర్ అని మార్గదర్శకాలు విడుదల చేసింది. మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో జిల్లాలో ఆయాల పోస్టులు ఎక్కువగా ఖాళీ ఉన్నాయి. గతంలోనే ఈ కేంద్రాల్లో ఉన్న భర్తీ చేయాల్సిన పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదికను పంపాం. ఎన్నికల అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉంటుంది.

–లలితకుమారి, ఐసీడీఎస్ పీడీ

క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి ఉగాది పురస్కారం



అవార్డు అందుకుంటున్న వెంకటరాజు

కొల్చారం(నర్సాపూర్): గెజిటెడ్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన బట్టు వెంకటరాజుకు ప్రత్యేక ఉగాది పురస్కారం లభించింది. రాష్ట్ర భట్రాజు సంఘం ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రాజు చేతుల మీదుగా అందుకున్నారు. వెంకటరాజు సైన్స్ ఉపాధ్యాయుడుగా రాణించడమే కాకుండా, ఆధ్యాత్మిక రంగంలో తన వంతు కృషి చేస్తున్నారు. ఈ అవార్డు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలి

మెదక్ కలెక్టరేట్: ఎలక్షన్ కమిషన్ అనుమతితో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కారం చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుకరి కృష్ణ ప్రభుత్వాన్ని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీపీఎస్‌తోపాటు ఉద్యోగుల పాలిట శాపంగా మారిన 317 రద్దు చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న డీఏలను, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ లోన్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, భార్యాభర్తల పోస్టింగ్‌లపై కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

రూ.1.45 లక్షలు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): వాహనాల తనిఖీల్లో భాగంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదును ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేట ఎస్‌ఐ శంకర్ కథనం మేరకు.. స్థానిక కోళపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపడుతున్నాం. మహారాష్ట్ర వైపు నుంచి ఓ వాహనంలో డాక్టర్ అనీల్‌కాంబ్లే రూ.1,45,800 ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లొద్దని సూచించారు. తీసుకెళ్తే సరైన పత్రాలు చూపించాలని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంచు సుధాకర్(25)కి ఏడాదిన్నర కిందట వివాహం జరిగింది. భార్య ఎలీషా, సుధాకర్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. భార్యాభర్తలు ఇటీవలె గ్రామానికి రాగా గర్భవతిగా ఉన్న ఎలీషా డెలివరీ కోసం శనివారం పుట్టింటికి వెళ్లింది. తల్లి ఏసుమణి చర్చికి వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో సుధాకర్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చర్చి నుంచి ఇంటికొచ్చిన ఏసుమణి తలుపులు తీసి చూడగా సుధాకర్ చనిపోయి ఉన్నాడు. కొంత కాలంగా తన కుమారుడు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్సును చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-799863]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185023]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పడకేసిన పల్లె వైద్యం

24 గంటల వైద్య సేవలు ఉత్తిమాటే
- గ్రామీణ పీహెచ్‌సీల్లో మధ్యాహ్నం వరకే వైద్యం
- రాత్రి వేళల్లో ఆస్పత్రులకు తాళాలు
- ప్రజలకు అందని అత్యవసర సేవలు
- గర్భిణులకు సైతం అవస్థలు
- వేధిస్తున్న డాక్టర్ల కొరత

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) 24 గంటల వైద్య సేవలు ఉత్తి మాటగానే మిగిలిపోతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే ఆస్పత్రులు తీసి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రి అయితే తాళాలు దర్శనమిస్తున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు, క్షతగాత్రులు పట్టణాలను, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 21 మండల కేంద్రాలతో పాటు నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, మెజార్టీ ఆస్పత్రుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే సేవలు అందిస్తున్నారు. – చిన్నశంకరంపేట(మెదక్)



చిన్నశంకరంపేట పీహెచ్‌సీకి సాయంత్రం వేసిన తాళం

జిల్లాలోని మండల కేంద్రాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ ఆశించిన కనిపించడం లేదు. చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేవి.. ప్రసూతి సంఖ్య తగ్గిందని చెప్పి వైద్య సేవలు నిలిపివేశారు. ఇక్కడ పనిచేసే వైద్య సిబ్బందిని ఇతర చోట్లకు పంపించారు. ఆస్పత్రిలో అన్ని రకాల సేవలు అందించేందుకు అవసరమైన యంత్రాలు ఉన్నప్పటికీ వృథాగా మారాయి. మరో వైపు ఇద్దరు డాక్టర్లు సేవలందించాల్సిన ఆస్పత్రిలో ఒకే డాక్టర్‌తో కొనసాగిస్తున్నారు. ఆస్పత్రిలో స్టాఫ్ నర్సు కొరత ఉంది. ఇక్కడ పనిచేయాల్సిన స్టాఫ్ నర్సును ఇతర చోట్లకు డిప్యూటేషన్‌పై పంపించారు. అలాగే రక్త పరీక్షలు నిర్వహించాల్సిన ల్యాబ్ టెక్నీషన్, ఎన్‌సీడీ స్టాఫ్ నర్స్ డిప్యూటేషన్ వేశారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు నెలకొన్నాయి.

ఈ పీహెచ్‌సీల్లో సేవలు శూన్యం..

చిన్నశంకరంపేట పీహెచ్‌సీతోపాటు జిల్లాలోని మరికొన్ని ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చేగుంట, నార్సింగ్, ధర్మారం, కొడిపల్లి, కొల్చారం టేక్మాల్, శివ్వంపేట మండలాల్లోని పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్య సేవలు అందడం లేదు. అత్యవసరం వైద్యం కోసం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. మధ్యాహ్నం వరకే రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చి సాయంత్రం అయితే మూసివేస్తున్నారు. ఈ ఆస్పత్రుల అన్నింటిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కారణంతోనే ఆస్పత్రుల్లో 24 గంటల వైద్య సేవలు అందడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అలాగే పాపన్నపేట, వెల్దుర్తి వంటి పీహెచ్‌సీల్లో రాత్రి వేళల్లో కేవలం ఏఎన్‌ఎం, ఒక సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. వీరితోనే వైద్య సేవలు అందిస్తున్నారు.ఇక మాసాయిపేట మండలంలో అసలు పీహెచ్‌సీనే లేదు. ఇక్కడ ప్రమాదాలు జరిగినా, రోగాలు వచ్చినా, గర్భిణులు ఉన్నా అంతే సంగతులు.

జిల్లాలో...



రక్త పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

- మెదక్ జిల్లాలోని రామాయంపేట, నార్సింగి, చేగుంట, మాసాయిపేట, తూప్రాన్, మనోహరాబాద్, కాళ్లకల్ వరకు జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగితే బాధితులను రామాయంపేట లేదా తూప్రాన్‌కు తరలిస్తున్నారు.
- పాపన్నపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బంది డిప్యూటేషన్‌పై వెళ్లడంతో సరైన వైద్య సేవలు అందడం లేదు.
- మార్చి12న అర్ధరాత్రి వెల్దుర్తి మండల కేంద్రంలో పురటి నొప్పులతో ప్రసూతి కోసం వచ్చిన మహిళ వైద్య సిబ్బంది అందుబాటులో లేక ఆస్పత్రి బయటే ప్రసవం జరిగింది.
- చిన్నశంకరంపేట మండల కేంద్రంలో రాత్రి సమయంలో గర్భిణులు ప్రసవం కోసం వచ్చి వైద్యులు లేకపోవడంతో వెనక్కి వెళ్లిన ఘటనలు ఉన్నాయి.

24 గంటలూ సేవలు అందించాలి



గతంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించేవారు. కొన్నేళ్లుగా కేవలం ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే వైద్యం అందిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఎలాంటి ఆపదొచ్చినా చూసేటోల్లు లేరు. ముఖ్యంగా గర్భిణులకు, గుండెపోటుతో ఆస్పత్రికి వచ్చే వారికి కనీసం ప్రాథమిక చికిత్స అందని పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి 24 గంటల వైద్యులు అందుబాటులో ఉంచాలి.

– వనం నర్సింహులు, చిన్నశంకరంపేట

చర్యలు చేపడతా..



చిన్నశంకరంపేట పీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్ వెళ్లిన స్టాఫ్ నర్సుల తోపాటు ల్యాబ్ టెక్నీషన్‌ను వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. అలాగే 24 పాటు వైద్య సేవలు అందించేలా ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి ప్రయత్నిస్తా. ఆస్పత్రులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నా వంతు కృషి చేస్తాను.

– ఆవుల భాగ్యలక్ష్మి, ఎంపీపీ అధ్యక్షురాలు

అత్యాశకుపోయి ఖాతాలు ఖాళీ

- టాస్క్‌లు, కమీషన్ల పేరుతో సైబర్ మోసం
- రూ.11.10 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని
- మరో రెండు ఘటనల్లో ప్రైవేట్ ఉద్యోగులు



పటాన్‌చెరు టౌన్ : పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన మెసేజ్ కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.11.10 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల బీరంగూడ సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశారు. సైట్ నిర్వాహకులు ఆమెకు ఒక వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగిని ముందుగా రూ.2 వేలు చెల్లించి టాస్కులు చేయడం మొదలుపెట్టారు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితురాలు మొత్తం రూ.11.10 లక్షలు చెల్లించారు. చివరికి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచితులు స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6 లక్షల 54 వేలు..

అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్ దుర్గానగర్‌కి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి మార్చి 2వ తేదీన టెలిగ్రామ్ ద్వారా జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. వెంటనే అతడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. మొత్తం రూ.6 లక్షల 54 వేలు పెట్టుబడి పెట్టాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆదివారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో అమీన్‌పూర్ నరేందర్ నగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఫిబ్రవరి 13వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలు నమోదు చేసి మొత్తం రూ.1.17 లక్షలు పెట్టుబడి పెట్టాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు ఆదివారం అమీన్‌పూర్ పోలీసుల ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పెద్దకోడూరు గ్రామానికి చెందిన బోనాల మహేశ్ బైక్‌పై సిద్దిపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపల్లికి చెందిన పోతుల నాగరాజు రాంగ్‌రూట్‌లో లింగారెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకొని ప్రాథమికి చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్, కారు ఢీ :

పటాన్‌చెరు టౌన్ : టిప్పర్, కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన ప్రవీణ్ చారి, రుద్రారం గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పటాన్‌చెరు వైపు నుంచి లక్డారానికి కారులో వెళ్తున్నాడు. గ్రామానికి వెళ్లే రోడ్డులోకి రాగానే తారా గ్రేన్ కంపెనీ సమీపంలో టిప్పర్, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారు లో ఉన్న ప్రవీణ్ చారి కి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం పటాన్‌చెరుపరిధిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం, ఆటో ఢీ :

మిరుదొడ్డి(దుబ్బాక): డీసీఎం, ఆటో ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని లింగుపల్లి కూడవెల్లి వాగు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగుపల్లి గ్రామానికి చెందిన పెద్ద లింగన్న గారి భిక్షపతి కిరాణా సరుకులతో లింగుపల్లికి ఆటోలో వెళ్తున్నాడు. ఎదురుగా ఉన్న డీసీఎంను ఓవర్‌టెక్ చేస్తున్న క్రమంలో డీసీఎం ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో ఒక్కసారిగా బోల్తా కొట్టింది. ప్రమాదంలో భిక్షపతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ భిక్షపతిని చికిత్స నిమిత్తం మరో ఆటోలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుంటలో మునిగి బాలుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన కుశలం, మస్తాన్ దంపతులకు ఇద్దరు కుమారులు. ఏడాది కిందట బీహార్ నుంచి వచ్చి జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో ఇనుప సామగ్రి దుకాణంలో పనిచేస్తున్నారు. శనివారం ఇద్దరు పని నిమిత్తం గణేశ్‌పల్లికి వెళ్లగా ఇద్దరు కుమారులు రేషన్‌నాట్, అభిబుల్ల నాట్ తిగుల్ ఇంటి వద్దనే ఉన్నారు. సాయంత్రం ఇద్దరు కుమారులు మరో బాలుడితో కలిసి బ్రహ్మణకుంటలోకి ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ఈతరాక రేషన్‌నాట్ (9) కుంటలో మునిగిపోయాడు. వెంటనే మిగితా ఇద్దరు వెళ్లి గ్రామస్తులకు చెప్పారు. పని ముగించుకొని అప్పుడే వచ్చిన తల్లిదండ్రులకు విషయం తెలియడంతో కుమారుడి కోసం కుంటలో వెతికారు. రాత్రి అయినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం కుంటలో మృతదేహం తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



లారీని పట్టుకున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న లారీని ఆదివారం పోలీసులు జాతీయ రహదారిపై పట్టుకున్నారు. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, గుజరాత్‌కు చెందిన ఓ లారీ అనుమానాస్పదంగా వెళ్తున్న క్రమంలో ఆపి తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి 300 వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుజరాత్ తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ పోలీసుల ఎదుట అంగీకరించాడు. వెంటనే కేసు నమోదు చేసిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. రెండు రోజుల కిందట బియ్యం తరలిస్తున్న లారీ పట్టుబడిన విషయం తెలిసిందే.

ప్రాణం తీసిన ధాన్యం కుప్ప

- బైక్‌తో ఢీకొట్టిన వాహనదారుడు
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి



రఘుపతి మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను బైక్ ఢీకొనడంతో వాహనదారుడు మృతి చెందిన ఘటన మండలంలోని కుకునూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మానెపల్లి గ్రామానికి చెందిన దుబాసి రఘుపతి పని నిమిత్తం బైక్‌పై వెల్దుర్తికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కుకునూర్ గ్రామ శివారులో బీటీ రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పలను బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఘటనా స్థలికి చేరుకున్న ఎస్‌ఐ నవతగౌడ్‌తో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. వాహనదారుడు మృతిచెందిన గంటలోపు అదే ప్రాంతంలో మరో మూడు బైక్‌లు ధాన్యం కుప్పలను ఢీకొని బోల్తాపడడంతో పలువురికి గాయాలైనట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మీది నుంచి వెళ్లిన బోరు డ్రిల్లింగ్ వాహనం



కుర్మయ్య (ఫైల్)

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ – సంగారెడ్డి రహదారిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్‌ఐ పుష్పరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం చింతల్‌పల్లి గ్రామానికి చెందిన మడ్ల కుర్మయ్య (45) నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. బైక్‌పై పని నిమిత్తం నర్సాపూర్ పట్టణం నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న గుర్తు తెలియని కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకాలే వస్తున్న కుర్మయ్య బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. బైక్ వెనుక నుంచే వస్తున్న బోరు డ్రిల్లింగ్ వాహనం కిందపడ్డ కుర్మయ్య పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఖర్చులకు డబ్బు ఇవ్వలేదని..

- పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



నవీన్ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): తండ్రి మందలించాడని ఆత్మహత్యకు పాల్పడిన కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గుమ్మడిదలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం గుమ్మడిదల గ్రామానికి చెందిన పిట్ల బాలేశ్ చిన్న కుమారుడు నవీన్(24) ఈనెల 4న ఓ ఫంక్షన్ ఉందని తండ్రిని డబ్బులు అడిగాడు. బలాదూరుగా తిరుగుతున్నావని, డబ్బులు ఇవ్వనని తండ్రి చెప్పడంతో వారి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నవీన్ వారి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అక్కకు సమాచారం ఇచ్చాడు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా నవీన్ పడిపోయి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఓటరు హెల్ప్ లైన్ 1950

- సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్
- అందుబాటులో 8 రకాల సేవలు
- ఫిర్యాదులపై తక్షణ చర్యలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



బ్యానర్ ఏర్పాటు చేసిన అధికారులు



ఓటర్ల సందేహాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

సంగారెడ్డి టౌన్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు వచ్చే సందేహాలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ఉచిత హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లాలో రెండు పార్లమెంటు నియోజక వర్గాలు, ఐదు అసెంబ్లీ నియోజక వర్గాల్లో మొత్తం 1,609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాల్లో 14,18,688 మంది ఓటర్లు ఉన్నారు.

ఓటరు సహాయ కేంద్రం..

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రం 24 గంటలు పనిచేస్తోంది.1950 నంబరుకు ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టారు. నిత్యం 15 నుంచి 20 మంది ఫోన్ చేసి ఫిర్యాదులు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఎక్కువగా ఓటరు జాబితాకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నాయి. ఓటరు మార్పు కోసం, అడ్రస్ మార్పు, పేరు తప్పుగా పడిందని వంటి దరఖాస్తులు వస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

ఏప్రిల్ 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండటంతో ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగేఅవకాశం ఉంది. ఫిర్యాదుల వివరాలను సంబంధిత అధికారులకు చేర వేస్తున్నారు.

ఎనిమిది రకాల సేవలు..

సహాయ కేంద్రంలో ఎనిమిది రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. పోలింగ్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఫిర్యాదులు, అభిప్రాయాల సేకరణ, ఎన్నికల అధికారికి సంబంధించిన వివరాలు, శాసనసభ నియోజకవర్గ సమాచారాన్ని ఓటర్లకు తెలియజేయడం, కేంద్రం చిరునామా, ఎన్నికల సమాచారం 24 గంటలు ఓటర్లకు సాయం అందించడం వంటి సేవలు ఇందులో ఉంటాయి.

24 గంటలు అందుబాటులో..

ఓటరు సహాయ కేంద్రం 24 గంటలూ పనిచేస్తుంది. ఇందులో సిబ్బంది షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఫోన్ చేసినప్పుడు ఫోన్ నంబరు, చిరునామా నమోదు చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేశారు. అదే సమయంలో సంబంధిత వెబ్‌సైట్‌లోనూ ఓటరు నమోదు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

1950 ఓటరు సహాయ కేంద్రం సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల సహకారం ఉంటేనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే, పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సందేహాలు తెలుసుకోవడానికి వీలు ఉంటుంది.

– అఖిలేష్ రెడ్డి, ఓటర్ సహాయ కేంద్రం నోడల్ అధికారి